కథా కౌముది

# యాదృచ్ఛికం - శారద

(అడిలైడ్ నగర వీధుల్లో రెండేళ్ళ కింద జరిగిన సంఘటన ఆధారంగా...)

కొత్త ఐఫోన్ అన్ని రకాలా స్పెసిఫికేషన్స్ చూసుకుని తృప్తిపడ్డాడు, రఘు. బిల్లు చెల్లించి పాకెట్ తీసుకుని హుషారుగా దుకాణంలోంచి బయటపడ్డాడు. క్రిస్మస్ రోజులు కావటంతో, శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతం అయినా టీటీ ప్లాజా మాల్ పార్కింగ్ లాట్‌లో జనం బాగా ఉన్నారు.

ఇక్కణ్ణించి లైబ్రరీ కెళదామా అని ఆలోచిస్తూ కారు దగ్గరికి చేరుకున్నాడు. ఏ మాత్రం లీవు పెట్టకుండా ఏణ్ణర్థం పనిచేసేసరికి ఆరువారాల లీవు పేరుకుపోయింది. యాజమాన్యం అతన్ని మర్యాదగా రెండు వారాలు లీవు తీసుకోక తప్పదని మొహమాట పెట్టేసరికి, లీవు పెట్టి ఏం చెయ్యాలో తోచక బోరుగా ఉందతనికి. ఆడిలైట్‌లాటి చిన్న నగరంలో రెండువారాలు ఏ పనీ లేకుండా ఉండటం పాతికేళ్ళ యువకుడికి బోరే మరి. పోనీ, ఈసారి ఇండియా వెళ్ళినప్పుడు అమ్మా నాన్న చెప్పినట్టు పెళ్ళి చూపులకెళ్ళే అయిడియా మంచిదేమోనని ఈ మధ్యనే అనిపిస్తుంది. కానీ, అసలే ఎకానమీ బాగాలేదు. పైగా ఇండియాలో అమ్మాయిలకి అమెరికా అబ్బాయి అయితే తప్ప కళ్ళుకానటంలేదు! ఎన్ని రోజులిలా ఒంటరిగా ఉండాలో! పోనీ ఇక్కడ తనకు తెలిసిన అమ్మాయిల నెవర్నైనా కదిలిద్దామంటే తనకి చచ్చే సిగ్గూ, మొహమాటమూ! కొత్త వాళ్ళూ, అందులో అమ్మాయిలయితే అసలే మాట పెగలదు! ఈ ఒంటరితనం భరించాల్సిందే మరి.

స్నేహితులందరితో కలిసి కేంపింగ్ ప్లాను వేసాడు కానీ, దానికోసం ఇంకొకరోజు ఆగాలి. అందరూ శనివారం పొద్దున్నకి కానీ కదలమన్నారు! ఆలోచనల్లోనే కారు పార్కింగు లోంచి మెయిన్ రోడ్డుమీదికొచ్చాడు.

పార్కింగ్ లోంచి బయటికొచ్చే దారి ఎప్పటిలాగే కిక్కిరిసి ఉండటంతో కార్లన్నీ ఆగిపోయాయి. ఉన్నట్టుండి అతని దృష్టి పక్క లేన్‌లో కారు డ్రైవింగ్ సీట్లో కూర్చున్న అమ్మాయి మీద పడింది. ఎక్కడో చూసాడామెని. చూడటానికి ఇండియన్ లానే ఉంది. జీన్స్ మీద కుర్తా! ఎక్కడో చూడటమే కాక, మాట్లాడిన జ్ఞాపకం కూడా! తెలుగమ్మాయా? ఉగాది పండగప్పుడు జరిగిన పార్టీలో కలిసాడా? లేకపోతే ఆఫీసులోనా? వెనక సీట్లో చిన్న పాపో, బాబో మరి, బేబీ సీట్లో ఉంది. అంటే పిల్ల తల్లా? తనకి పెళ్ళయి పిల్లలున్న ఆడవాళ్ళెవరూ అంత బాగా పరిచయం లేదు. మరెవరబ్బా? గుర్తుకు రావటం లేదు. కార్లు కదలటంతో ఆలోచనలు కట్టిపెట్టి ముందుకెళ్ళాడు.

మెయిన్ రోడ్డు మీద వేగంగా నడుపుతూ తన పక్కనించే ముందుకెళ్ళిపోయిందామె, కానీ లేన్లో పెద్ద ట్రక్కు అడ్డురావటంతో, లేన్ మారి తన ముందుకొచ్చింది. మధ్యలో నున్న కారు ఎడమ చేతి వైపు వీధిలోకి వెళ్ళగానే రఘు కారుకీ ఆమె కారుకీ మధ్య ఇంకేకారు లేదు.

సిగ్నల్ దగ్గర ఆమె కారు, వెనక రఘు కారు ఆగి ఉన్నాయి. ఉన్నట్టుండి ఆమె కారు దగ్గర బాగా దృఢంగా పొడవుగా ఉన్నతను నిలబడి, కన్ను మూసి తెరిచేంతలో కారు తలుపు తెరుచుకుని లోపల కూర్చున్నాడు.

రఘు ఉన్నట్టుండి అలర్టయ్యాడు. ఎవరతను? అంత హఠాత్తుగా కారెలా ఎక్కగలిగాడు? ఆమె స్నేహితుడా? ఎందుకో అలా అనిపించలేదు. కారణం - అతని షర్టంతా అలుముకుని ఉన్న రక్తం!

ప్రియకి విసుగ్గా ఉంది. ఎరక్కపోయి వచ్చాను, ఇరుక్కుపోయాను, అప్పటికి నూటపదిహేనుసార్లనుకుంది, ఆ మాట. అలాగని మీరా నిస్సహాయంగా చూస్తుంటే ఊరుకోలేకపోయింది. అలవాటులేని పని, ఇబ్బందే మరి.

సెంటర్ లింక్ ఆఫీసులో చేరి ఆర్నెల్లే అయినా తనతో పనిచేసే మీరా మంచి స్నేహితురాలైంది. ఏణ్ణర్ధం పాపతో, ఇల్లూ సంసారమూ, ఆఫీసుతో కుస్తీపడుతూ ఉంటుంది. "నువ్వు మాత్రం చచ్చినా పెళ్ళాడకోయ్, ప్రియా" అని అప్పుడపుడూ జోక్ చేస్తూ ఉంటుంది. పైగా, "అసలు నీకేదైనా సంబంధం కుదిరేట్టు ఉంటే నేనే పనిగట్టుకుని చెడగొడతాను చూడు" అంటుంది! పాపని ఎప్పుడూ ఉంచే బేబీ కేర్ సెంటర్ "బిల్డింగ్ రినొవేషన్" అంటూ వారం రోజులు మూసివేసారు. తనూ వాళ్ళాయనా చేరి రెండు రోజులు సెలవు పెట్టి మేనేజ్ చేసారు. కానీ ఈ రోజు శుక్రవారం ఇద్దరికీ కూడా సెలవు పెట్టే పరిస్థితి లేదు. ఏం చేయాలా అని బెంబేలు పడుతుంటే తనే ఆఫర్ చేసింది, మీకేం ప్రాబ్లం లేకుంటే నేను పాపాయిని చూసుకుంటానని. ఎగిరి గంతేసి, పిల్లని తన చేతిలో పెట్టి వెళ్ళారు పొద్దున్నే.

అసలు పాప కొంచెం కూడా గొడవ చేయలేదు. ఏవో బొమ్మలు ముందేసుకుని ఆడుకుంది. మూడు గంటలకి కొంచెం టీ తాగి, పాపకి పాలు పోద్దామని చూస్తే పాలన్నీ విరిగిపోయాయి. సరే అని ఉసూరుమనుకుంటూ దగ్గరే ఉన్న టీట్రీ ప్లాజాకెళ్ళింది.

ఇదొక్కటే న్యూసెన్సు ఈ ఊళ్ళో! ఉప్పు కొనటానికైనా సూపర్ మార్కెట్ కెళ్ళి పెద్ద క్యూలో నుంచుని డబ్బు చెల్లించి రావాలి. తనొక్కతే అయితే నడిచే వెళుతుంది వీలయినంతవరకూ. కానీ పాపాయి నిద్ర పోతూ ఉండటంతో కారు తీయక తప్పలేదు. నాలుగయినా ఎండ ఇంకా మండుతునే ఉంటుంది. మాల్లో చల్లగా ఉండి, బయట భరించలేనట్టు ఉంది. పాప వెనక బేబీ సీట్లో నిద్రపోతుంది. ఇంటికెళ్ళి తనూ కొంచెం సేపు పడుకుంటుంది.

అబ్బబ్బ ఈ ట్రక్కులెందుకొస్తాయో, ఎప్పుడూ అడ్డంగా నడిచి వెళితే అయిదునిమిషాలు పట్టే దూరం, కారులో చుట్టూ తిరిగి వెళ్ళేసరికి పావుగంట! దీనికి తోడూ అడుగడుగునా ఈ సిగ్నల్సొకటి! మళ్ళీ ఎర్రలైటు.

అరె! ఇదేమిటి కారు తలుపు తెరుచుకుంది! ఎవరితను? లోపలికొచ్చి కూర్చున్నాడు. నోరెండిపోతుంది ప్రియకి. షర్టుమీదంతా ఆ రక్తమేమిటి? తనసలు అటువైపు తలుపు ఎప్పుడూ తెరవదు. ఇవాళ పాపాయిని కూర్చోపెట్టటానికి తెరిచి, మళ్ళీ లాక్ చేయటం మరిచిపోయి ఉంటుంది. ఇప్పుడెలా? వెనక చంటి పాప కూడా ఉంది. ఏదో అంటున్నాడు. హమ్మో! కత్తి తీసాడు.

"అరవకుండా, మాట్లాడకుండా నేను చెప్పినట్టు తీసికెళ్ళు. లేకపోతే, నిన్నూ నీ బేబీనీ కూడా..." కత్తిమెడకానించాడు.

సెంటర్ లింక్లో ఉద్యోగం వల్ల ఇలాటి రౌడీలతో మాట్లాడటం కొంచెం తెలుసు. వణుకుతున్న కంఠాన్నీ, దడ దడలాడుతున్న గుండెనీ కష్టం మీద అదుపులోకి తెచ్చుకుంటూ వీలైనంత నిబ్బరంగా అంది, "అలాగే! దూరంగా కూర్చుని చెపితే ఎక్కడికంటే అక్కడికి

తీసుకెళ్ళి దిగబెడతాను. నాకు కానీ, బేబీకి కానీ, ఏ విధమైన హాని కలిగించాలని చూసినా అరిచి గోల చేసి పోలీసులకి పట్టిస్తాను. డీల్?"

"డీల్! ముందుకెళ్ళి కుడివైపు లేన్లోకెళ్ళు?"

రఘుకి అంతా అయోమయంగా ఉంది. అప్రయత్నంగా ఆ కారు వెనక తన కారు పోనిచ్చాడు. ఏదో ఒక రకమైన అనీజీనెస్. ఆ అగంతుకుని వాలకం నచ్చలేదు. స్నేహితులని లిఫ్ట్ అడిగినట్టు కాకుండా దౌర్జన్యంగా కారెక్కినట్టనిపించింది. కానీ అదెలా సాధ్యం? ఆమె కారు తలుపు లాక్ చేసుకోవటం మరచిపోయిందా?

ఏదో మాట్లాడుకుంటున్నారు. అతని చేతిలో ఏదో ఉంది, కనిపించటం లేదు. ఆమె అతని వైపు తిరిగి ఏదో చెప్తుతోంది. ఏమైనా సరే వాళ్ళ కారుని ఫాలో చేయాలనే నిర్ణయించుకున్నాడు. చాలా తెలివి తక్కువ పనిచేస్తున్నానేమోనన్న అనుమానం పీడిస్తూనే ఉంది అతన్ని. మహా అయితే ఏమవుతుంది? తన అనుమానం నిజం కాకపోతే, వాళ్ళ ఇంటి దగ్గరో, మరెక్కడో దిగి వెళతారు. తను తన దారిన వాళ్ళని దాటుకుంటూ వెళ్ళిపోవచ్చు.

వాళ్ళ కారు సబర్బ్స్ వదిలి అడిలైడ్ సిటీకెళ్ళే దారి పట్టటం చూసి తనూ వెనకే పోనిచ్చాడు. మళ్ళీ కారు ఉన్నట్టుండి వెనక్కి తిరిగింది, టీ్రీగలీ వైపు. ఇదేదో వింతగా ఉంది. అతని అనుమానం మరింత బలపడింది.

సిగ్నల్ పసుపురంగులోకి మారటం చూసి, మెరుపులా పక్క లేన్లో కెళ్ళి ఆమె పక్కనే కారు ఆపాడు. అదృష్టవశాత్తూ పక్క లేన్ ఖాళీగా ఉంది. నెమ్మదిగా తలతిప్పి ఆమె వైపు చూసాడు. సందేహం లేదు, పార్టీలో చూసిన అమ్మాయే! ఆ అమ్మాయి తనకింకా పెళ్ళవలేదన్నట్టు గుర్తు. మరి వెనక బేబీ సీట్లో ఉన్న పాపాయెవరు?

ఆ పక్కన కూర్చున్నవాడు భారతీయుడైతే కాడు. మంచి ఒడ్డూ పొడుగుతో మొహం అంతా అక్కడక్కడా గాయాలు, రక్తసిక్తమై ఉన్నాడు. హమ్మో! వాడి చేతిలో తళతళలాడే కత్తి! ఆ అమ్మాయి అరచి మొత్తుకోవటం లేదేం? చుట్టూ ఎవరూ పట్టించుకోవటం లేదు. రఘుకి ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

బింకంగా వాడితో మాట్లాడిందే కానీ, పై ప్రాణాలు పైనే పోతున్నాయి ప్రియకి. అదృష్టవశాత్తూ పాపాయి నిద్రపోతుంది. లేచి ఏడుపు లంకించుకుంటే ఇతనాకత్తితో పాపాయిని పొడిచేసేటట్టున్నాడు. ఆ పాపాయికేదైనా అయితే మీరాకెలా ముఖం చూపించగలదు! అసలు తనైనా ప్రాణాలతో బయటపడ్డప్పటి మాట కదా! సిటీలో కెళ్ళిన తరువాత వీడెక్కడైనా దిగిపోతే, అంతే చాలు! గుళ్ళో దేవుడికి పాలతో అభిషేకం చేయిస్తాను. దేవుడా ఎలాగైనా ఈ ఆపద గట్టెక్కించు. నా కోసం కాకపోయినా ఆ పాపాయి కోసమైనా రక్షించు. మనసులో ప్రార్థిస్తూనే ఉంది ప్రియ. ఎంత ఒద్దనుకున్నా మళ్ళీ మళ్ళీ అతని చేతిలో తళతళా మెరుస్తున్న కత్తి వైపే వెళుతుంది చూపు.

మాటమాటకీ అసహనంగా కదులుతూ, చిరాగ్గా చాలా అపాయకరమైన వ్యక్తిలా ఉన్నాడు. ఎందుకబ్బా! తనూ రియర్ వ్యూ మిర్రర్ లోంచి వెనక్కి చూసింది. వెనకాల పాత నిస్సాన్ కారొకటి వస్తుంది. తను గమనించలేదు కానీ, చాలా సేపటినుంచీ ఆ కారు తమ వెనకే వస్తున్నట్టుంది.

ఈసారి ఆమెకి ఒళ్ళు భయంతో జలదరించింది. ఇతన్ని ఏదైనా గేంగ్ వెంటాడుతుందేమో! వాళ్ళు వెంబడిస్తుంటే తప్పించుకోవటం కోసం తన కారెక్కినట్టున్నాడు. కారాగితే చాలు, అతన్నీ తననీ కూడా ప్రాణాలతో వదిలేట్టులేరు, ఆ కారులో

ఉన్నవాళ్ళు. ఇవాళ్టితో తనకి భూమ్మీద నూకలు చెల్లిపోయాయి, అనుకుంటే ఆమెకి ఎక్కిళ్ళేని ఏడుపు వచ్చింది. ఇంట్లో అమ్మా, నాన్నా, తమ్ముడూ, పుట్టి పెరిగిన హైదరాబాదూ, స్నేహితులూ అందరూ గుర్తొచ్చారు. తన వాళ్ళందరినీ వదిలి, ఈ దేశం కాని దేశంలో దిక్కులేని చావు చచ్చిపోబోతుందా?

పెద్ద రవుండ్ అబవుట్ వస్తుంటే ఉన్నట్టుండి అన్నాడు, "సిటీకి కాదు! వెనక్కి తిప్పు. మళ్ళీ టీట్రీగలీకే పోనివ్వు." కారు రయ్యిన వెనక్కి తిప్పింది. అతని అనుమానం నిజమే! నిసాన్ కారు కూడా తమ వెనకే తిరిగింది. భగవంతుడా! ఇప్పుడేది దారి? వెనక సీట్లో పాపాయి ఇంకా నిద్రపోతూనే ఉంది.

ఏదో చేయాలని తెలుస్తోంది కానీ, ఏం చేయాలో తెలియటం లేదు. పుస్తకాల్లో, సినిమాల్లో హీరోల బుర్ర ఎప్పుడూ చురుగ్గా పని చేస్తూ ఉంటుంది. ఖర్మ! తన బుర్ర మామూలుగానే చురుగ్గా పని చేయదు. ఇప్పుడు మరీ మొండికేసింది. అంతా బ్లాంక్‌గా అనిపిస్తుంది రఘూకి.

ఇడియట్‌లాగా వాళ్ళ కారుని వెంబడిస్తున్నాడు. వాడు కోపం భయంతో రెచ్చిపోయి, వాళ్ళనాకత్తితో పొడిస్తే? వాళ్ళకి సహాయం చేయబోయి, వాళ్ళనింకా అపాయంలోకి నెట్టుటున్నాడా? అసహనంగా కదిలాడు. మెళ్ళో మొబైల్ ఫోన్ కదిలింది. ఎవరికైనా ఫోన్ చేస్తే! అసలు చార్జ్ ఉందో లేదో! పోలీస్ స్టేషన్‌కి చేసే కాల్స్‌కి ఛార్జ్ ఉంటుందా? ప్రయత్నిస్తే తప్పేమిటి? కారు కొంచెం స్లో చేసి గబగబా ఎమెర్జెన్సీ నంబరు నొక్కాడు. ఫోన్ మోగుతూనే ఉంది.

అమ్మయ్య! ఎవరో తరుముకొస్తున్నట్టు, "నా ముందు కారులో ఒక అమ్మాయిని ఎవడో రౌడీ సతాయిస్తున్నాడు" అన్నాడు ఆవిడకి తన యాసతో కూడిన ఇంగ్లీషు ఉచ్చారణా వేగం వల్ల అర్థమయినట్టు లేదు. మెల్లిగా, "ప్లీజ్ రిలాక్స్! మెల్లిగా ఊపిరి తీసుకుంటూ, మీరెక్కడున్నారో, ఎలా ఉన్నారో చెప్పండి ముందు," అంది. కొంచెం స్తిమిత పడి, "నేను టీట్రీగలీలో ఉన్నాను. మెయిన్ రోడ్డు మీదే ఉన్నాను. నా ముందు వెళుతున్న కారులో ఒక అమ్మాయి అపాయంలో ఉందనిపించి అర్థగంట నుంచీ ఫాలో అవుతున్నాను. నిజానికి నాకూ భయంగానే ఉంది" అన్నాడు.

తెచ్చి పెట్టుకున్న బింకం అంతా కరిగిపోయింది ప్రియకి. కళ్ళల్లోంచి నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. అలా అధైర్యాన్ని ప్రదర్శిస్తే అవతలి వ్యక్తి మరింత రెచ్చిపోయి డామినేట్ చేస్తాడని ఆమెకి తెలుసు. అయినా ఏడుస్తూనే ఉంది. పాపాయి మెల్లిగా కదులుతోంది. ఆకలికి ఏడుస్తుందో ఏమో!

వెనక ఆ నిస్సాన్ కారు వెళ్ళిపోతే బాగుండు. అయిదున్నర కావస్తుంది. గంటన్నరనుంచీ తిరుగుతున్నారు. ఇప్పుడు టీట్రీగలీ నుంచి చుట్టూ తిరిగి అడిలైడ్ హిల్స్ వైపెళుతున్నారు. కారులో పెట్రోలు అయిపోవచ్చింది. ఆ సంగతి పైకంటే ఏమవుతుందోనని భయం.

కొంచెంసేపాగి, అతన్ని అడిగింది, "ఆ నిస్సాన్ కారులో వెంబడిస్తుంది ఎవరో నీకు తెలుసా?" అని.

"అనవసరమైన విషయాల్లో తలదూర్చకు" కర్కశంగా అన్నాడు.

"నీకెక్కడికెళ్ళాలో సరిగ్గా చెపితే అక్కడ దించి నేనింటికి వెళతాను. ఇంటికి వెళ్ళటం ఆలస్యమైందని ఇప్పటికే నా భర్త పోలీస్ కంప్లయింట్ ఇచ్చి ఉంటాడు" అతన్ని బెదిరించటానికి చీకట్లో బాణం వేసింది.

కాసేపాలోంచి, "సిటీకే పోనీ," అన్నాడు.

"సిటీలో ఎక్కడ దింపను?"

"హిండ్లీ స్ట్రీట్."

అతనికి నిద్రొస్తున్నట్టుంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. కష్టం మీద కళ్ళు తెరిచి ఉంచుతున్నాడు. తను నిశ్శబ్దంగా ఉంటే అలాగే నిద్రపోతాడేమో! మాట్లాడకుండా ఉండదలచుకుంది. వెనకాల నిస్సాన్ కారులో ఉన్న మనిషి మొబైల్ ఫోన్లో వదలకుండా మాట్లాడుతున్నాడు. ఎక్కడైనా వాణ్ణి పోలీసులు పట్టుకుంటే బాధ వదులుతుంది.

"మీరన్న మాట నిజమే మిస్టర్ రఘూ! ఆ కారులో ఉన్న అమ్మాయి అపాయంలోనే ఉన్నట్టుంది. మేము అన్ని స్టేషన్లనీ అలర్ట్ చేసాము. మీరు ఆ కారుని అలానే వెంబడిస్తూ మీరు ఉన్న కో ఆర్డినేట్స్ మాకు చెపుతూ ఉంటే మా పని కొంచెం తేలికవుతుంది. వీ రియల్లీ అప్రీషియేట్ యువర్ పేషన్స్ ఎండ్ కరేజ్" ఆపరేటర్ అతన్ని ఉత్సాహపరుస్తుంది. గత పావుగంట నుంచీ అతను వాళ్ళకి తాము వెళుతున్న రోడ్ల వివరాలు ఇస్తూనే ఉన్నాడు.

"అడిలైడ్ హిల్స్ నుంచి సిటీకి వెళుతున్నాం. బహుశా నార్త్‌టెరేస్ అనుకుంటా."

"ఆల్‌రైట్! నార్త్‌టెరేస్ కానీ, కింగ్ విలియం స్ట్రీట్ కానీ ఎక్కగానే మాకు చెప్పండి. అక్కణ్ణించి మే చూసుకుంటాం," ఫోన్ పెట్టేసిందావిడ.

ఇంకొక పదినిమిషాలు. కానీ యుగాల్లా గడిచాయి. అదిగో నార్త్‌టేరేస్! అక్కడ మళ్ళీ పోలీసులకి చెప్పి తన దారిన తను పోతాడు. అరగంట నుంచీ అలా అనుకుంటున్నాడే కానీ, ఆమెని ఒంటరిగా ఆ కత్తి వీరుడి చేతిలో వదిలి వెళ్ళటానికి మనసొప్పటంలేదు.

నార్త్‌టేరేస్ వచ్చేసింది. ఇంకొక్క అయిదు నిముషాల్లో హిండ్లీ స్ట్రీట్ వచ్చేస్తుంది. అతను దిగీ దిగగానే తను వెళ్ళగలగాలి. అసలు నిజంగా దిగుతాడో దిగడో! నార్త్‌టెరేస్ చాలా పెద్దరోడ్డు. శుక్రవారం సాయంత్రం కావటంతో చాలా రద్దీగా ఉండి ట్రాఫిక్ నత్తనడక నడుస్తుంది. ప్రియకి కొంచెం సిటీలో రోడ్లు అంత బాగా తెలియవు. ఎడమచేతివైపులేన్లన్నీ వేరు వేరు వీధుల్లో కెళుతూ ఉంటాయి, కాబట్టి మధ్యలేన్లో వెళుతుంది.

అకస్మాత్తుగా బ్రేకు వేసి ఆగింది ప్రియ. పర్పెండిక్యులర్‌గా ఉన్న ఫ్రోం రోడ్డు మీంచి రయ్యమ్మటూ పెద్దకారు ఎదురుగా వచ్చి ఆగింది, ట్రాఫిక్ అంతా కీచు కీచు మంటూ హారన్లతో ఆగిపోయింది. మైగాడ్! ఇప్పుడీ ట్రాఫిక్ జాంలోంచి ఎప్పటికి బయటపడుతుంది?

ఆగిన కార్లోంచి ముగ్గురు ఆగంతకులు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ తన కారు దగ్గరకొస్తున్నారు. ఎవరు వాళ్ళు? ప్రియకి భయంతో ఆలోచనలు స్తంభించిపోయాయి. ఆ వెనకనున్న నిస్సాన్ కూడా ఆగిపోయింది. ముగ్గుర్లో ఒకతను ఆ కారు దగ్గరకెళ్ళి డ్రైవర్‌తో ఏదో చెపుతున్నాడు. ఆ కారు డ్రైవరు తన కారు వైపు చూపిస్తూ ఏదో అంటున్నాడు. అయిపోయింది!

ఆమె అలా బ్లాంక్‌గా చూస్తూనే ఉంది. ఆమె కారు తలుపు తెరుచుకుని, ఆమెని ఎవరో రెక్క పట్టుకుని బయటికి ఎత్తుకెళ్ళారు. ఇంకొక అతను రెప్పపాటులో వెనక సీట్లోంచి పాపాయిని తీసుకెళ్ళాడు. ఎక్కణ్ణించి ఊడిపడ్డారో, ఇంకో ఇద్దరు ఆ రౌడీని రెక్కలు పట్టుకుని లాక్కెళ్ళి కార్లో పడేసుకుని తీసుకెళ్ళిపోయారు. అంతా కన్ను మూసి తెరిచేంతలో జరిగిపోయింది.

ఏమిటిదంతా? వాళ్ళెవరు? గేంగ్‌స్టర్లా? ఉన్నట్టుండి అర్థమయింది ఆమెకి, పోలీసులు! రిలీఫ్‌తో ఆమె పెద్దగా ఏడుస్తూ అక్కడే పేవ్‌మెంట్ మీద కూలబడిపోయింది. ఆమెని తీసుకెళ్ళిన పోలీసు మెల్లిగా ఆమె వెన్ను నిమురుతూ, నిస్సాన్ కారు వైపు చూపించి, "ప్లీజ్ రిలాక్స్! ఏం ప్రమాదం లేదు. యూ ఆర్ అవుటాఫ్ డేంజర్. ఆ జెంటిల్ మేన్ వల్లే మీరివాళ పెద్ద ఆపద నుంచి బయట పడ్డారు. అదృష్టవంతులు" అంటూ ఓదారుస్తున్నాడు. ఆమె తలతిప్పి నిస్సాన్ కారు వైపు చూసింది. పొట్టిగా, కళ్ళజోడుతో, కొంచెం మొహమాటంగా ఒక పక్కకి నిలబడ్డ అతన్ని ఇంతకు ముందెక్కడో చూసింది! రఘు అక్కడికి చేరుకోగానే, అతని మెడ చుట్టూ చేతులు

వేసి, కన్నీళ్ళతో, "థేంక్‌యూ! థేంక్ యూ సో మచ్ ! మీరే లేకుంటే ఇవాళ నేను," ఆమెకి మాటలు పెకలటం లేదు. రఘు తత్తరపడుతూ, ఆమె చేతులు విడిపించుకుంటూ, "నమస్తే! నా పేరు రఘు, హోల్డెన్‌లో ఇంజినీర్ని" అన్నాడు.

"ఇవాళ కోర్టునుంచి ఉత్తరం వచ్చింది. ఏడాది కింద అరెస్టైయిన రౌడీ కేసులో సాక్ష్యం ఇవ్వటానికి రమ్మన్నారు. దొంగ వెధవ! ఎంత భయపెట్టాడారోజు నన్ను!"

"వాణ్ణంత తిట్టిపోయకు మరి! ఆ రోజు వాడు అలా నీ కారులోకెక్కకపోతే, అసలు మనిద్దరమూ మాట్లాడుకుని ఉండేవాళ్ళమే కాదు."

"అంతేలే! నీలాటి ముద్దపప్పుకి అమ్మాయితో మాట్లాడాలంటే ఎంతో పెద్ద డ్రామా మరి!"